# ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం



బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- ఎమ్మెల్యే ఆత్రం సక్కు, రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి మ్యానిఫెస్టో విడుదల

ఆసిఫాబాద్, అక్టోబర్ 27 : ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్‌ధ్యేయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. సామాన్యుడి సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ సంకల్పంతో రూపొందించిన ఎన్నికల మ్యానిఫెస్టో పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆత్రం సక్కు , రాష్ట్ర కార్యదర్శి అరిగెల నాగేశ్వర్ రావుతో కలిసి శుక్రవారం తన నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ్యానిఫెస్టో ఆధారంగా గెలుపే లక్ష్యంగా ప్రచారం చేపడుతామన్నారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమ పథకాలను ప్రజలు గమనించాలని కోరారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోను ప్రజలందరికీ అర్థమయ్యేలా వివరిస్తామన్నారు. ఇచ్చిన హామీలైన రైతుబంధు రూ.16 వేలు, పేద మహిళలకు భృతి రూ. 3 వేలు, కుటుంబానికి కేసీఆర్ బీమా రూ. 5 లక్షలు, దివ్యాంగులకు ఆసరా పింఛన్లు రూ. 6016, ఆసరా పింఛన్లు రూ. 5016, రూ. 400 వంట గ్యాస్ సిలిండర్, ఇంటింటికి సన్నబియ్యం, ఆరోగ్య శ్రీ పరిమితి రూ. 15 లక్షలకు పెంపు, జర్నలిస్టులకు వైద్య బీమా తదితర పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, నాయకులు ఇర్ఫాన్, బాబురావు, భరద్వాజ్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం



మంగీలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

తిర్యాణి, అక్టోబర్ 27 : మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మాండ్ల జగదీశ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలుపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, ఆత్రం సక్కు ఫోర్స్ జిల్లా అధ్యక్షుడు ఆత్రం వినోద్,నాయకులు గాయేంగి మల్లేశ్,కాసం రాజయ్య,శంకరయ్య,ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,గ్రామ అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కంపెనీస్థాయిలో రన్నర్స్‌గా బెల్లంపల్లి అండ్ మందమర్రి జట్టు



రన్నర్‌గా నిలిచిన బెల్లంపల్లి అండ్‌మందమర్రి ఏరియా జట్టు

రెబ్బెన, ఆక్టోబర్ 27 : ఆర్జీ-3 ఏరియా రుద్రమాదేవి స్టేడియంలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీల్లో బెల్లంపల్లి అండ్ మందమర్రి ఏరియా జట్టు రన్నర్‌గా నిలిచిందని బెల్లంపల్లి ఏరియా వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం జరిగిన కంపెనీస్థాయి ఫైనల్ పోటీల్లో ఆర్జీ-1 అండ్ ఆర్జీ-2 ఏరియా, బెల్లంపల్లి అండ్ మందమర్రి ఏరియా జట్లు తలపడ్డాయి. ఇందులో ఆర్జీ-1అండ్ఆర్జీ-2 ఏరియా జట్టు విన్నర్‌గా నిలిచినట్లు వారు వెల్లడించారు.

## ఎఫ్‌సీఐని తనిఖీ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 27 : పట్టణంలోని భారత ఆహార సంస్థను శుక్రవారం సంప్ర దింపుల కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్వాలిటీ విషయంలో నాణ్యత పాటించడం లేదని, అధికారులు, రైస్‌మిల్ యజమానులు కుమ్మక్కై ఎఫ్‌సీఐని మోసం చేస్తున్నారని సభ్యుడు బుర్ర సురేందర్ గౌడ్ ఆరోపించారు.



రెబ్బెన చెక్‌పోస్ట్ వద్ద కారులోని వస్తువులు తనిఖీ చేస్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్

# పకడ్బందీగా ఎన్నికల నియమావళి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్
- రెబ్బెన చెక్‌పోస్టు తనిఖీ

రెబ్బెన, అక్టోబర్ 27 : జిల్లాలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. రెబ్బెన చెక్‌పోస్ట్‌ను శుక్రవారం తనిఖీ చేసి వాహనాలను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు, మద్యంతో పాటు ఇతరాత్ర పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. మోడల్ కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్తే ఆధారాలు ఉండాలని, బంగారం, ఇతర వస్తువులు తీసుకువెళ్లేవారు అధారాలు చూపాలని లేకుంటే సీజ్ చేస్తామన్నారు. ఎన్నికలు స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పని చేస్తుందన్నారు.

# లేతన్‌గూడ పాఠశాలలో కుమ్రం భీం వర్ధంతి



కుమ్రం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రెబ్బెన,అక్టోబర్ 27 : మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో గల లేతన్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం కుమ్రం భీం వర్ధంతిని నిర్వహించినట్లు హెచ్‌ఎం దొడ్డిపట్ల రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయికృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బడీడు పిల్లలను స్కూల్లో చేర్పించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో

సిర్పూర్(యూ), అక్టోబర్ 27 : బడీడు పిల్లలు స్కూల్లోనే ఉండేలా చూడాలని ఎంఈవో కుడ్మెత సుధాకర్ అన్నారు. మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రభుత్వోపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యా వ్యవస్థను మరింత మెరుగుపర్చాలన్నారు. బడీడు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి డ్రాపౌట్ లేకుండా స్కూల్లో చేర్పించాలన్నారు. సిర్పూర్-(యూ), లింగాపూర్ మండలాల టీచర్లు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి, అక్టోబర్ 27 : మండలంలోని బెండార సమీపంలో గల ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిశ్, కామర్స్ సబ్జెక్టులు ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, డిగ్రీ స్థాయిలో బోధించిన అనుభవం ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా మోడల్ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.